వరద ముంపునకు పరిష్కారమేదీ?



శనివారం కురిసిన వర్షానికి టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారిపై పారుతున్న వరద

వర్షం పడితే జలమయం అవుతున్న మలక్‌పేట జోన్‌లోని పలు కాలనీలు • సమస్య శాశ్వత పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం

దిల్‌సుఖ్‌నగర్: దశాబ్దాలు గడుస్తున్నా వరద ముంపు సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు.. చిన్న వర్షానికే కాలనీలు ముంపునకు గురి కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నాయకుల హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో మలక్‌పేట జోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు చిన్నపాటి వాన కురిసినా ముంపునకు గురి కావడం పరిపాటిగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు వర్షం నీరులో కలిసి కాలనీలను ముంచెత్తుతోంది.

- సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని నాలాల్లో ఇంత వరకు పూర్తి స్థాయిలో చెత్తను తొలగించలేదు. దీనికి తోడు అభివృద్ధి పనుల పేరుతో ఈ వేసవిలో ఎక్కడికక్కడే రోడ్లను తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. భారీ వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో జోన్ పరిధిలోని ముంపు కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు.

వర్షా కాలం వస్తే గుండె దడ ..

వర్షాకాలం వచ్చిందంటే మలక్‌పేట జోన్ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట, సింగరేణి కాలనీ, ఆర్‌కే పురం డివిజన్లలోని పలు కాలనీలు, బస్తీలు, దిల్‌సుఖ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు గుండె దడ మొదలవుతుంది. గట్టి వర్షం వచ్చిందంటే ముంపు తప్పదని, జీవనం అస్తవ్యస్తమవుతుందని వారి భయం. వర్షా కాలం రాక ముందే డ్రైనేజీల్లో పూడిక తీయించాల్సిన అధికారులు కాలయాపన చేస్తుండటంతోనే వర్షం వచ్చిన ప్రతీసారి తమకు ముంపు ముప్పు తప్పడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

- వరద తాకిడి ఎక్కువగా ఉన్న కాలనీలకు ప్రత్యేక వరద నీటి కాలువలను నిర్మించి వాటి ద్వారా మూసీలోకి వరద నీరు వెళ్లేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే పనులు చేపట్టి వరద ముంపు సమస్య నుంచి తమకు శాశ్వత విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకు .. వణుకు



చంపాపేట డివిజన్ వాసులకు వరద ముంపు భయం

చంపాపేట: నాలాలు పూడిక తీత, విస్తరణకు నోచుకోక.. వరద నీటి కాలువ నిర్మాణం పూర్తికాక చంపాపేట డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీల ప్రజలు వర్షం పడితే ముంపు భయంతో వణికిపోతున్నారు. అంతేగాక బాక్స్‌టైప్ నాలా నిర్మాణం కోసం కాలనీల్లో 12 అడుగుల లోతు గుంతలు తవ్వి వదిలేయడంతో వాటిలో వర్షం నీరు చేరి సెప్టిక్ ట్యాంక్‌లుగా మారడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. అంతేకాకుండా గుంతల్లో వరద నీరు చేరడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఉదయ్‌నగర్, పద్మానగర్, మల్‌రెడ్డినగర్, పద్మానగర్, మారుతీనగర్, ఎస్‌జీఆర్, రాజిరెడ్డి నగర్, దుర్గా భవానీనగర్, రెడ్డి కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు వేగవంతం చేయాలి



చంపాపేట డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీల్లో ఇప్పటికే ప్రారంభించిన వరదనీటి కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. శనివారం గంట పాటు కురిసిన వర్షానికే కాలనీలు నీట మునిగాయి. ఓపెన్ నాలాలు, అసంపూర్తిగా ఉన్న వరద నీటి కాలువ నిర్మాణాల కారణంగా చిన్నపాటి వర్షానికే వరద నీరు డ్రైనేజీ నీటితో కలిసి కాలనీలను ముంచెత్తింది.

– రాము, చంపాపేట

మరోసారి ముప్పు తప్పదా?

- పూర్తికాని ట్రంక్‌లైన్ నిర్మాణం
- కొద్దిపాటి వర్షానికి కాలనీలోకి చేరిన నీరు
- ఆందోళనలో అయ్యప్ప కాలనీవాసులు



అయ్యప్ప కాలనీలోకి చేరిన వరద

నాగోలు: వర్షం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించినా.. ఆకాశం మేఘావృతమైనా ఆ కాలనీవాసులు భయంతో వణికిపోతున్నారు. చినుకు పడితే చాలు వారికి కంటి మీద కునుకు పట్టడం లేదు. నాగోలు డివిజన్‌లోని అయ్యప్ప కాలనీవాసుల పరిస్థితి ఇది. గతంలో కురిసిన భారీ వర్షాలకు అయ్యప్ప కాలనీ పూర్తిగా నీట మునిగింది. అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీని సందర్శించి వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. బండ్లగూడ చెరువు నుంచి మూసీ వరకు ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయితే, అధికారులు నిర్లక్ష్యం కారణంగా ట్రంక్‌లైన్ నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో తమకు మరోసారి ముంపు సమస్య తప్పేలా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కేవలం ఒక గంట పాటు కురిసిన భారీ వర్షానికి అయ్యప్ప కాలనీ జలమయమైంది. పై కాలనీల నుంచి వరద నీరు రావడంతో కాలనీలోని కొన్ని ఇళ్లలోకి నీరు చేరింది. కొద్దిపాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే.. గంటల తరబడి భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని, మరోసారి కాలనీ నీట మునిగే ప్రమాదం ఉందని అయ్యప్ప కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బండ్లగూడ చెరువు నుంచి మూసీ వరకు చేపట్టిన ట్రంక్‌లైన్ నిర్మాణం త్వరగా పూర్తి చేసి తమ కాలనీ ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కాస్మోపాలిటన్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



రుద్ర నర్సింహ

మన్సురాబాద్: డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రుద్ర నర్సింహ, ఉపాధ్యక్షుడిగా యుగేంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా వనం భాస్కర్, సంయుక్త కార్యదర్శిగా నగేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మహ్మద్ సయాద్దీను ఎన్నుకున్నారు. అలాగే, గౌరవ సలహాదారులుగా సత్తయ్య, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, జగదీష్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, సంతోష్, రమేష్, గోపాల్, జ్ఞానేశ్వర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ, కాలనీలోని ప్రధాన సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 21, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 28, ఆలు 28, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 09, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 70, అర్వి 45, మునగ 40, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 45. సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

కాలనీల అభివృద్ధే ప్రధాన లక్ష్యం



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎల్బీనగర్: కాలనీల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్ కాలనీ ఫేజ్–1 కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి, రోడ్లు, తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టామని త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని కాలనీవాసులతో అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, నాయకులు నవీన్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించండి



శ్రీ సాయిబాబా కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఉన్న మంచినీటి, డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులు వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి ప్రవన్‌కుమార్ జలమండలి అధికారులను కోరారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని శ్రీ సాయిబాబా కాలనీలో కార్పొరేటర్ పర్యటించి కాలనీలోని తాగునీటి, డ్రైనేజ్ లైన్ సమస్యలను పరిశీలించారు. కాలనీలో తాగునీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతోందని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. వెంటనే ఆయన సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి నీటి సమస్యను వివరించారు. నీరు ఎక్కువ ప్రెషర్‌తో సరిపడా సరఫరా చేయాలని కోరారు. డ్రైనేజీ లైన్ పాతది కావడం వల్ల లీకేజీలు ఏర్పడి నిత్యం మురుగు బయటకు వస్తోందని, వాటికి మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ జలమండలి అధికారులతో మాట్లాడి డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామరావు, జనరల్ సెక్రటరీ సురేష్ యాదవ్, రాజశేఖర్, వెంకటయ్య గౌడ్, సాయి రెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్బీనగర్: ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని శ్రీకృష్ణదేవరాయ కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాలనీలో తరుచూ ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు మృధుల, సుభాష్, నాయకులు రాజిరెడ్డి, బొమ్మిర ఘురాంనేత, శ్రీధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

'పట్నం' గెలవాలని గుల్బర్గా దర్గాలో ప్రార్థనలు



గుల్బర్గా దర్గా వద్ద కాంగ్రెస్ నాయకులు

లింగోజిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి విజయం సాధించాడంతో పాటు మధుయాష్కీ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి రావాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో గుల్బర్గా దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గాలో చాదర్, దట్టీని సమర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ జాఫర్, సర్వర్, ఎండీ సుక్తాద్దున్, ఎండీ షబ్బీర్, మున్నా, జునాతుద్దీన్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

మహోన్నత నాయకుడు 'పుచ్చలపల్లి'



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హస్తినాపురం: దక్షిణ భారత దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీని సంస్థాగతంగా నిర్మించిన మహోన్నత నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.చంద్రమోహన్ అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ నందనవనం శాఖ ఆధ్వర్యంలో కుంటిగొల్ల రాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి నాయకులు చంద్రమోహన్, ఆలేటి ఎల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజల సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో యాదయ్య, రవీందర్, కస్తూరి శ్రీనివాస్, లక్ష్మయ్య, కృష్ణ, రామస్వామి, పురుషోత్తంచారి, అంజమ్మ, ఆదిలక్ష్మి, బుచ్చమ్మ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ భరోసా



రమేశ్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి భరోసా కల్పిస్తోందని, ఈ పథకం పేదలకు వరంలాంటిదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీకి చెందిన రమేశ్ మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. పేద వాడైన అతను వైద్యానికి అవసరమైన డబ్బుల కోసం ఎమ్మెల్యే సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారుడు రమేశ్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మున్నా యాదవ్, అనిత పాల్గొన్నారు.

మలక్‌పేట మహిళా సమాజం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మలక్‌పేట: మలక్‌పేట మహిళా సమాజం సర్వసభ్య సమావేశం ఆదివారం అక్బర్‌బాగ్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రెసిడెంట్‌గా వీఎస్ అనురాధ, వైస్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ సుబ్బలక్ష్మి, జనరల్ సెక్రటరీగా బి.శిరీష, జాయింట్ సెక్రటరీలుగా ఎస్వీ వసుధ, జి. జానకి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్. కల్పన, వాణి ఉడిపి, కోఆర్డినేటర్లుగా ఆర్.బబిత, ఎం.నీరజ చంద్ర, ట్రెజరర్ వాణి శ్రీభట్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నలిని సూద్, రాధ జాగృతి, జి.సౌమ్య, నాగలక్ష్మి, రేఖ, జ్ఞానప్రసూనాంబ ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్ అనురాధ మాట్లాడుతూ.. మహిళల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఆరుగురు దోపిడీ దొంగల అరెస్ట్

హస్తినాపురం: చాట్ యాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తిని పరిచయం చేసుకున్న ఓ ముఠా అతడిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బంగారు గొలుసు దోపిడీ చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన వనస్థలిపురం పోలీసులు ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇన్‌స్పెక్టర్ వై.అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. ఈనెల 15న పసునూరి శోభన్‌బాబు చాట్ యాప్ ద్వారా చాటింగ్ చేస్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తితో పరిచయమైంది. శోభన్‌బాబును అతడు ఎల్బీనగర్ నుంచి గుర్రంగూడ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తర్వాత ఆ వ్యక్తి తన ఆరుగురు స్నేహితులను అక్కడికి పిలిపించాడు. శోభన్‌బాబును కొట్టి అతడి దగ్గర ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నల్గొండ జిల్లాకు చెందిన నిందితులు రమావత్ కిరణ్ కుమార్ (23), నల్లగంటి పవన్(23), కొర్రబాలు (23), కుక్కల నాగరాజు (23), రమావత్‌రోహిత్(22), నెనావత్ మకట్‌లాల్(28)లను అరెస్టు చేశారు. బంగారు గొలుసు ను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. కాగా, పరారీలో ఉన్న పత్లావత్ రమేశ్ అనే మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ముందస్తు చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వర్షాకాలం సమీపిస్తున్నందున ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సాయిసామ్రాట్‌నగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరదనీరు కాలనీల్లో చేరుతోందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ, వర్షపునీటి అవుట్‌లేకపోవడంతో వర్షాలు పడినప్పుడు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అనిల్‌యాదవ్, డీఈ వెంకన్న, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, అర్కల కామేశ్‌రెడ్డి, మాదరి రమేశ్ తదితరులున్నారు.

వైకుంఠధామం నిర్మాణానికి వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో వైకుంఠధామం నిర్మించాలని 18వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు గుండు నర్సింగ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 20 వేల జనాభా ఉన్న శ్రీరాం కాలనీలో శ్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. గతంలో నిర్మించిన రెండు శ్మశాన వాటికలు పూర్తిగా కుచించుకుపోయి, నివాసాల నడుమకు మారాయన్నారు. దీంతో అక్కడ అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందన్నారు. శ్మశాన వాటికకు ప్రభుత్వ స్థలం కేటాయించి వైకుంఠధామం నిర్మించాలన్నారు.



మీర్‌పేట: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తడి, పొడి చెత్తపై అవగాహన



ఇంటింటికీ తిరిగి బొట్టు పెడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

ఎల్బీనగర్: తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, రోడ్లపై చెత్తను వేయకూడదని పారిశుద్ధ్య కార్మికులు ప్రజలను కోరారు. ఆదివారం బీఎస్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్ కాలనీ ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ అజుముద్దీన్, కాలనీ అధ్యక్షుడు రాంచందర్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్‌లో ఉచిత విద్య

ఇబ్రహీంపట్నం: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు డీఆర్‌డీపీ ద్వారా 2024–25 సంవత్సరానికి గాను ఉచిత విద్య అందించనున్నారు. ఇబ్రహీంపట్నంలోని వాసవి జూనియర్ కాలేజీని డీఆర్‌డీపీ ఎంపిక చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకుల, కేజీబీవీ హాస్టల్స్‌లో చదివిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 7.0 జీపీఏకు పైగా గ్రేడ్ సాధించిన వారు అర్హులని డీఆర్‌డీపీ యాజమాన్యం తెలిపింది. ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరొచ్చని సూచించారు. వివరాలకు 6363008585 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

వరద కాల్వ కబ్జా

మహేశ్వరం: మండల పరిధిలోని గొల్లూరులో ఆ ముదాల చెరువులోకి వెళ్లే వరద నీటి కాల్వను రియల్ వ్యాపారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆదివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గొల్లూరు–అమీర్‌పేట్ మార్గంలో ఆముదాల చెరువులోకి వెళ్లే కాల్వను మూసి చిన్న పైపులు వేసి అడ్డుగా నిర్మాణం చేపట్టడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు చెరువులోకి వెళ్లకుండా రోడ్డుపై నిలిచిపోతున్నదన్నారు. భగీరథగూడ తుమ్మల చెరువు, పులిమక్త మేళ్ల చెరువు, గొల్లూరు ఎర్రకుంట చెరువుల నుంచి వచ్చే వరద నీరు ఆముదాల చెరువులోకి వెళ్లేదారులన్నీ మూసి నామమాత్రంగా చిన్న పైపులు వేసి కాంక్రీట్‌తో నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంచర్ నిర్వాహకులు అముదాల చెరువులోకి వెళ్లే కాలువను వదిలేసి పక్కన నిర్మాణాలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చెరువు కాల్వ కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, రైతులు సత్తయ్య, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.

పొదుపు సంఘం రజతోత్సవం

పహాడీషరీఫ్: శ్రీ వినాయక పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం రజతోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నిర్వహించారు. స్థానిక విజయలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 25 ఏళ్లుగా విజయవంతంగా ముందుకు సాగుతున్న సంఘం విశేషాలపై చర్చించుకున్నారు. మున్ముందు సైతం పూర్తి పారదర్శకతతో కలిసి కట్టుగా ముందుకు సాగుతూ ఆర్థిక ప్రగతిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘంలోని సభ్యులు మరణిస్తే రూ.21 వేల బీమా సదుపాయం కల్పించడంతో పాటు 60 ఏళ్లు నిండిన సభ్యులకు నెలకు రూ.1,500 చొప్పున ఇవ్వాలని తీర్మానించి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సల్ల భద్రమ్మ, సహాయ కార్యదర్శులు మనోజ్, రాంబాబు, కోశాధికారి ఎనగండ్ల శ్రీధర్ గౌడ్, పాలక వర్గ సభ్యులు మేకల మురళి, శిరీష పాల్గొన్నారు.

సర్వేలకే సాయం పరిమితం

- నీట మునిగిన పంటలు
- వందలాది మూగజీవాల మృత్యువాత
- నాలుగేళ్లుగా అందని పరిహారం



రావిర్యాల పెద్ద చెరువు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షానికి రావిర్యాల పెద్ద చెరువు దిగువన ఉన్న పంట పొలాలు నీటమునిగాయి. మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రైతులకు కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లింది. జరిగిన నష్టానికి ఇప్పటికీ పరిహారం అందలేదు. నియోజకవర్గంలోనే ఇది అతిపెద్ద చెరువు. ఈ చెరువులోకి మంఖాల్ అటవీ భూమి, బాగ్ మంఖాల్, చెరువు నీటితో పాటు, తుక్కుగూడ సూరం చెరువు వరద నీరు వచ్చి చేరుతుంది. ఇప్పటికీ అది నిండు కుండలా కనిపిస్తోంది. రావిర్యాల పెద్ద చెరువులో స్థానికంగా చాలా మంది రైతులకు శిఖం భూపట్టాలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి సరైన వర్షాలు లేక చెరువులో చుక్క నీరు చేరలేదు. దీంతో రైతులు వరి, కంది, పత్తి, కూరగాయలు, మూగజీవాల పోషణ తదితర పనులు చేస్తూ జీవనోపాధి పొందేవారు. 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి రాత్రికి, రాత్రే వరద చేరింది. దీంతో శిఖం భూమి పంటలు, వ్యవసాయ పరికరాలు మునిగిపోవడంతో పాటు వందలాంది మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రూ. కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీంతో రైతన్న ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. అదే సమయంలో జాతీయ విపత్తు నివారణ కమిటీ సభ్యులు నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులు నుంచి వివరాలు సేకరించి నష్ట పరిహారం అంచనా వేశారు. అయినా నేటికీ రైతులకు పరిహారం అందలేదు. ఈ పరిహారంపై రైతన్నలు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేసినా ఫలితం మాత్రం శూన్యం.

కూలీలుగా మారిన రైతులు

చెరువులో ఉన్న భూములు ఇప్పటి వరకూ నీటిలో ఉండిపోయాయి. దీంతో నాటి రైతులు నేడు ఉపాధి కోసం దినసరి కూలీగా మారారు. రావిర్యాల పరిసర ప్రాంతంలో ఉన్న పలు పరిశ్రమల్లో కూలీలుగా పని చేస్తున్నారు. చెరువులో ఉన్న నీరును తూముల ద్వారా బయటికి విడుదల చేస్తే తాము పంటలు సాగు చేసుకుంటామని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికీ రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF HON'BLE PRL. DIST. JUDGE: R.R.DIST AT : L.B.Nagar
G.W.O.P.22 OF 2024

Between
Dopathi Sudhakar Reddy ...Petitioner
AND
All Concerned ....Respondant
To
All Concerned

The Petitioner Dopathi Sudhakar Reddy S/o Malla Reddy filed petition for declaring Guardian for all purpose, to granting permission to alienate or sale of below mention petition schedule property to third parties for the welfare of the minor Baby kumari Dopathi Praharshini D/o late Datha Reddy under provisions of Guardian and Wards Act. If anybody has got any objection or claim may appear before the above Court on 03-06-2024 at 10:30 hours and to file counter. if any.

PETITION SCHEDULE. PROPERTY

All that piece and parcel open land bearing plot on 49 southern part, admeasuring an area of 173 Sq.yrds and southern side of plot no 49 northern part admeasuring an area of 37 Sq.yrds in all admeasuring 210 Sq.yrds or its equailent to 175.56 Sq.mrts in survey nos 175,176,179,180,181 and 182 situated at Akhilandeshwari Nagar in Sahebnagar Kalan village, Hayathnagar revenue Mandal, Ranga Reddy Dist under Ward no 5 and block no 2 of Hayathnagar Circle of Greater Hyderabad Municipal Corporation limits, under registration sub-Dist Vanasthalipuram and bounded by:
NORTH: North side of plot no 49 Northern part. **SOUTH:** 25' Wide Road **EAST:** Plot no 50; **WEST:** 30' Wide Road

V. Raghava Reddy, G. Kantharao
Advocates
Mobile No.9642321425
Counsel for Petitioner